కథానిక

# కలకాలం సీత....

పగడాల హరిప్రసాదరావు

నాలుగుగంటలు ఖంగుఖంగున మ్రోగాయి. సీత హృదయం ఝల్లుమంది. చేతిలో పుస్తకం జారిపోయింది. నాలుగుగంటలు. తన రైలు బయలు దేరేవేళ. స్టేషనులో వుంటుంది. 'కూ' మని చెవులు గింగుర్లెత్తేట్టు అరుస్తూంటుంది. గార్డు యీల వేస్తాడు. గార్డు...తనను చాకలెట్లు యిచ్చే ముసలిగార్డు పచ్చజెండావూపుతూ రైలెక్కుతూంటాడు. తను కనబడనందుకు ఎంతబాధ పడతాడో!

స్టేషనుమాష్టరు దగ్గర పని అవగానే తనకై తెచ్చిన చాకలెట్ల పొట్లాన్ని యిచ్చి ఎంతో ప్రేమతో మాట్లాడే గార్డు...యిప్పుడెవరికిస్తాడు చాకలెట్లు? రైలునీ, నెరసిన మీసాలలోంచి నవ్వుతూ మాట్లాడే గార్డు తాతయ్యనీ చూచి ఎన్నాళ్ళయింది! తనంటే ఎంతదయ ఆ తాతయ్యకు! లేకపోతే ఎందుకు తెస్తాడు రోజూ చాకలెట్లు! ఎందుకో పాపం తనంటే ఆ దయ. తను ఇక్కడకు కాపరానికొచ్చే రోజున తాతయ్య కళ్ళవెంట బొటబొట నీళ్లు కారాయి. వృద్ధచ్ఛాయలు అలముకుంటూన్న ఆ తాతయ్య కళ్ళల్లో ఏదో విచారం తొణికిసలాడింది. ఏదో చెప్పబోయాడు...కాని మాట్లాడలేకపోయాడు. అడుగుదామనుకుంది తను. కాని సాహసించలేకపోయింది. తాతయ్య పెదిమలు నవ్వుతూన్నా కళ్ళుమాత్రం ఏడ్చాయి. తనముందు ఆ విచారాన్ని కప్పుకోడానికి ఎంతో ప్రయత్నించాడు.

మూణ్ణెల్లయింది రైలునూ, తాతయ్యనూ చూచి. ప్రతిరోజూ నాలుగయ్యేటప్పటికల్లా తన కళ్ళ ముందు రైలు, ఆ తాతయ్య కనబడుతూంటారు. చెవుల్లో ఆ గార్డు విజిలు, రైలుకూత గీపెట్టేప్పటికల్లా ఉలిక్కిపడేది. ఒక్కోసారి నిద్రలోకూడా ఆ చప్పుడు విని లేచిపోయేది. ఎన్నో రాత్రులు రైలు తాతయ్య ధ్యానంలో నిమగ్నమై పోయి నిద్రలేకుండా గడిపేది. ఊహాప్రపంచంలో వున్న సీత ప్రసాద్ చెప్పులధ్వనితో ఉలికిపడింది.

'అలా వులికిపడ్డావేం? జడుసుకున్నావా.'

'అబ్బే! ఏంలేదు.' బొంకింది. కళ్లుమాత్రం ఎక్కడో అగాధాన్ని వెతుక్కుంటూన్నట్టు కాంతి హీనంగా వున్నాయి.

'ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ అలా దీనంగా వుంటావేం సీతా?' అతని ప్రశ్నకు మౌనాన్నే జవాబుగా యిచ్చి లోనికి వెళ్లింది కాఫీ తేవడానికి.

తనంటే ప్రసాద్‌కు ఎంతో ప్రేమ. తనే మాత్రం బాధపడినా ప్రసాద్ సహించలేడు. తనను ఆనందడోలికల్లో వూగించడానికి ఎంతో ప్రయత్నించేవాడు. కాని తను ఆ రైలును, గార్డు తాతయ్యను మరువలేక ఎంతో బాధ పడుతూంది. పోనీ ఆఖరికి ఆ రైలు బయలుదేరే గ్రామానికి కాపురం వెళ్ళిపోదామంటే తనభర్త పనిపోతుందే! ఇక్కడకు ఆరుమైళ్ళంది ఆ పట్నం. అక్కడే పనిచూసుకుందామని చెప్పింది. ఈవూరు బాగో లేదంది ఎన్నిసార్లో తను. కాని తన హృదయంలో వున్నదాన్ని చెప్పలేకపోయింది. తనబాధ వ్యక్తం చేయలేకపోయింది. తాతలకాలం నుండి వుంటూన్న గ్రామాన్ని ఎలావదలడం అన్న భర్త జవాబుతో తనకోర్కెలు అలా నశించిపోవలసిందేనా? తన రైలును, తాతయ్యను ఎప్పుడూ చూస్తూవుండలేనా యింక అని కుమిలిపోయింది కుమిలిపోతూనే, పోనీ ఒక్కసారైనా ఆ తాతయ్యను చూడనోచుకోలేదా...అనుకుంది.

ఆరాత్రంతా తను నిద్రాదేవిని దూరంగా వుంచింది. నిమిషనిమిషానికీ తనకోర్కె మరీ బల పడిపోతూంది. పక్కనున్న ప్రసాద్‌ను చూచి...యశోధరను విడిచివెళ్లే సిద్ధార్థునిలా బాధపడింది.

ఆరుమైళ్ళ దూరంలోవున్న పట్టణంనుండి తన రైలు రేపు వుదయంబయలుదేరుతుంది. ఏదో నిశ్చయానికొచ్చింది. గడియారం అప్పుడే మూడు గంటలు చూపుతూంది. ప్రక్కమీదనుండి లేచింది. ఇంటిని దాటి రోడ్డు పట్టింది.

తనలోవున్న కోర్కెబలంతో ఆపట్టణం చేరుకుంది. స్టేషను దగ్గరవుతూన్న కొద్దీ తన హృదయం ఎంతో బరువై పోతూన్నట్లు బాధపడింది. స్టేషను.... రైలు...తన రైలు కనబడేప్పటికి హృదయం బరువుతో బ్రద్దలై పోతూందేమో అనిపించింది.

టికెట్ కలక్టర్ పిలుస్తున్నా వినిపించుకోకుండా గేటుదాటి ప్లాట్‌ఫారంమీదకు పరుగెత్తింది. తనకళ్లు తాతయ్యకోసం తీక్ష్ణంగా వెతికాయి. గార్డు తాతయ్య స్టేషనుమాస్టరుతో మాట్లాడుతూన్నాడు. మూడు నెలల్లో తాతయ్య ఎంతో ముసలివాడై పోయినట్టు కనిపించాడు.

తిన్నగా తాతయ్య పెట్టెలోకెళ్ళి కూర్చుంది.

తాతయ్య యీలవేశాడు. పోర్టరు గంట కొట్టాడు. రైలు అరిచింది. ఆ ధ్వనులు తనకు వీణానాదంకంటె మృదుమధురంగా వున్నాయి. అబ్బ! ఎన్నాళ్ళయింది విని! గార్డు తాతయ్య బల్లమీద పొట్లంవుంది. అదేపొట్లం...చాకలెట్లు. చాకలెట్లు ఎవరికి తీసుకువెడుతున్నాడు యింకా తాతయ్య? మనసులో ఈర్ష్య కువకువలాడింది.

మెల్లగా రైలుకదిలింది. తాతయ్య పచ్చ జండా వూపుతూ రైలుమెట్లమీద కెక్కాడు. దృష్టి యింకా యింజన్‌వైపే వుంది. స్టేషను దాటగానే తాతయ్య పెట్టెలో అడుగుపెట్టాడు. కళ్ళజోడులోంచి తీక్షణంగా చూస్తూ 'ఎవరు? సీతా!' 'తాతయ్యా!' అంటూ సీత తాతయ్య హస్తాల్లో వాలిపోయింది. తాతయ్య చేతులు వణికాయి. సీత తల ముసలికళ్ళలోని వెచ్చని నీళ్ళతో తడిసింది.

'ఏం! యిలావచ్చావ్! ప్రసాద్ ఏడీ? అమ్మ దగ్గరకు వెడుతున్నావా?' ఎన్నో ప్రశ్నలేశాడు సీత తల నిమురుతూ తాతయ్య.

'నిన్ను, యీ రైలుని చూడకుండా వుండలేక యిలావచ్చాను తాతయ్యా! పదేళ్ళనుండీ నిన్నూ రైలునూ చూస్తూ ఎంతో ఆనందంతో పెద్దదాన్నయాను. ఈ మూడు నెలలనుండీ మిమ్ము చూడక పోయేప్పటికి నాజీవితం జైలులోవున్నట్లే అయింది. తప్పని సరిగా మిమ్ము మరచి పోవాలని ఎంతో ప్రయత్నించాను. కాని గడియారం నాలుగు గంటలుకొట్టేప్పటికల్లా ఆ చిన్నిరైలుస్టేషను, చిరునవ్వుతో మాట్లాడే నీముఖం, భయంకరంగాఅరిచే రైలు యీనాకళ్ల ముందు ప్రత్యక్షమయేవి. రోజూకుమరచిపోవాలని ఎంతప్రయత్నిస్తూన్నానో, అంతకు రెట్టింపుగా మిమ్ము మరువలేకపోతూన్నా. ప్రజ్వలిస్తూన్న కోరికను అణచుకోలేకపోయాను. మిమ్ము ఒక్కసారైనా చూడాలనే కోరికతో వారికి చెప్పకుండా...'

'అయ్యో! ఎంతపనిచేశావమ్మా! ప్రసాద్ ఏమనుకుంటాడో, మళ్లా నిన్ను...' మాటపూర్తి చేయలేకపోయాడు, వణికే కంఠంతో తాతయ్య.

అంతలో మరోస్టేషను వచ్చింది. తాతయ్య రైలు దిగాడు. సీత చాకలెట్లు తింటూకూర్చుంది.

రైలు కదిలింది. తాతయ్యవచ్చి కూర్చున్నాడు.

'ఇంత చిక్కిపోయావేం తాతయ్యా! జబ్బు చేసిందా?'

'జబ్బేమీ చేయలేదమ్మా! అంతకంటె ఎక్కువే సంభవించింది. ఇంకెంత కాలం బ్రతుకుతానమ్మా! అయినా ఎందుకు బ్రతికి? ఎవరికోసం!'

సీత అలా కళ్ళప్పగించి మౌనంతో కూర్చుంది.

'ఎంతో ఆశతో యిన్నాళ్లు బ్రతికాను. కాని నా జీవితాశ భగ్నమై పోయింది.'

'అదేమిటి తాతయ్యా! ఏడుస్తున్నావా!'

'ఇంక నా బ్రతుకే ఏడుపైపోయిందమ్మా! నా ఆశలన్నీ భగ్నమైపోయాక ఏడుపుగాక యింకేముందమ్మా! నిన్ను ఆ స్టేషనులో చూచిన మొదటి రోజునే నా హృదయంలో ఆశపుట్టింది. అప్పటికి నీకు ఆరేళ్లు వుంటాయి. ఆ మొదటి రోజు నీకు జ్ఞాపకంవుండదు. నీ చిరుత హృదయాన్ని నావైపు ఆకర్షించుకోవాలని ప్రయత్నించాను. జయించాను కూడా. నిన్ను నాకోడలుగా చేసుకోవాలనుకున్నాను.

'అలా సంవత్సరాలు పరుగెత్తాయి. నువ్వు పెద్దదానవవుతూన్న కొలదీ నా కోరిక కొమ్మలు వేయనారంభించింది. మీ నాన్న నీకు సంబంధాలు వెతుకుతూన్నాడని ఓ రోజు చెప్పావు. ఇక నా కోర్కెలు సఫలమయ్యే రోజువచ్చిందని ఆశపడ్డాను. ఆ ఆశతోనే ఓరోజు మీనాన్నవద్దకువచ్చి మాట్లాడదామనుకున్నాను. ప్రయాణానికి సిద్ధమై గుమ్మంలో అడుగు పెట్టేప్పటికి టెలిగ్రాంవచ్చింది. ఇంకేముందమ్మా సీతా! బి. యే. చదువుతూన్న మా రఘు సముద్రంలో స్నానంచేస్తూ మునిగి పోయాడట. నా ఆశావృక్షం కుమిలిపోయింది ఆనాడే...'